కథానిక

# పెద్దల చిన్నతనం

అవసరాల రామకృష్ణారావు

"సంపెంగపువ్వు కావాలా? గులాబీపువ్వు కావాలా?" తనూ రాజ్యమూ పేర్లు పెట్టుకుని వచ్చి కామాక్షి నడిగారు. "ఏం అడగనూ?" అని కామాక్షి ఆలోచించుకునేలోగా గలగలమంటూ ఓ జట్కాబండి వచ్చి అక్కడ ఆగి వాళ్ళ "పువ్వులమ్మే" ఆటను చెదరగొట్టింది. జట్కాలోంచి కాంతం అక్కయ్య దిగింది! ఎన్నాళ్ళయింది కాంతం అక్కయ్య వెళ్ళిపోయి! కూడా మరెవరో దిగేరు. ఇతనే కాబోలు. కామేశ్వరరావంటే! కాంతం అక్కయ్య యితన్ని తీసుకుని కదూ ఖరగ్‌పూర్ వెళ్ళిపోయిందని కాకినాడ కాకినాడంతా మార్మోగిపోతే! అయినా అనకూడదు గాని కాంతం అక్కయ్య ఉండుండి యిలాంటి పాడుపనెందుకు చెయ్యాలి? నాన్ననీ అమ్మనీ తన్నీ పెద్దక్కయ్యనీ తమ్ముణ్ణీ వదిలేసి ఎక్కడికో ఎందుకు పారిపోవాలి? ఛీ! కాంతం అక్కయ్య మంచిది కాదు అమ్మా, పెద్ద అక్కయ్యా దీన్నెప్పుడూ తిడుతూంటారు. దీని జట్టుండదంతే!

కాంతం అక్కయ్య తనదగ్గరకే వచ్చింది. తన్నెత్తుకుని ముద్దెట్టుకుంది. "ఇదేనండీ, మా చెల్లెలు శశి" అని అతనితో చెప్పింది. అతనూ తన్నెత్తుకున్నాడు. జేబులోంచి ఏదో పొట్లం తీసి చేతిలో పెట్టేడు. "ఏం శశీ, మీ కాంతం అక్కయ్యని ఎప్పుడేనా తలుస్తున్నావా?" అని అడిగాడు తనకి సిగ్గేసింది. మాట్లాడలేదు.

బండీవాడు సామాన్లు లోపల పెట్టేసి వెళ్ళిపోయాడు. "ఎవరొచ్చారో" అని కాబోలు పెద్దక్కయ్య వచ్చి కిటికీలోంచి చూసింది. అదోలా చూసి వంటింట్లోకి వెళ్ళిపోయింది అమ్మని పిలవడానికి కాబోలు. ఆ చూపు చూసి కాంతం అక్కయ్య ఎందుకో గతుక్కుమంది. ముందు అక్కయ్య, వెనకాల తన్నెత్తుకుని అతనూ యింట్లో ప్రవేశించారు. "కూర్చోండి" అంది అక్కయ్య నవ్వుతూ. అతను చిన్న దగ్గు చేసి ప్రక్కనున్న కుర్చీలో కూలబడ్డాడు. అక్కయ్య కూడా అక్కడే చిన్న పెట్టెమీద కూర్చుంది. చాలా దూరంనుంచి వచ్చినట్టున్నారు. బట్టలు మాసిపోయి, జుట్టుకి నూనె లేక ఉన్నాయి. ఎవరైనా వచ్చి మాట్లాడనైనా దగ్గర పిలవరేం? అమ్మకీ పెద్దక్కయ్యకీ దీనిమీద యింత పగ ఎందుకూ? కాంతం అక్కయ్యని చూస్తే తనకు ఎన్నెన్ని సంగతులు జ్ఞాపకం వస్తున్నాయ్?

అయినా అది వాళ్ళ అమ్మా నాన్నా చేసుకున్న దురదృష్టమేమో! తనకి జ్ఞానం వచ్చిందగ్గర్నుంచీ చూస్తోంది వాళ్ళ నాన్నకి జీతం అరవై రూపాయిలే. దీనితో అమ్మా, నాన్నా, తనూ, యిద్దరు అక్కయ్యలూ తమ్ముడూ బతకాలి! ప్రతి చిన్న విషయానికీ ప్రతిరోజూ అమ్మా, నాన్నా దెబ్బలాడుకుంటూనే ఉండేవారు. తన్నీ, తమ్ముణ్ణీ దెబ్బలాడుకోవద్దని వాళ్ళిలా ఎందుకు దెబ్బలాడుకుంటున్నారో అని కాంతం అక్కయ్యని అడుగుతే, "శశీ, లేమివల్ల అసంతృప్తి ఎక్కువవుతుందమ్మా! మన దురదృష్టం వల్ల మనకు తినడానికి సరిపోయే తిండి నాన్న తేలేకపోతున్నారే! తృప్తి లేకపోవడం వల్లనేనమ్మా ఈ కలహాలు" అని చెప్పింది.

తనకందులో కొన్ని మాటలు బోధపడ్డాయి, కొన్ని బోధపడలేదు. ఏమయితేనేం. నాన్నా, అమ్మా వాదించుకుని బాధపడుతూనే ఉండేవారు. తను విన్న మాటలవల్ల చిన్నక్కయ్యకి పెళ్ళి కాలేదన్న బాధ వారికి ఎక్కువయినట్లు కనపడేది. పెద్దక్కయ్యకు పెళ్ళయి అయిందేమిటి? పెద్దబావకు పెళ్ళినుంచునుంచీ ఉబ్బసం చూస్తే నాన్నకన్నా పెద్దేమో అనిపించేది. పెద్దక్కయ్యకి పాపాయి పుట్టిన మూడు నెలలకి కాబోలు పాపం పెద్దబావ పోయేడట

అమ్మా, నాన్నా కష్టాలు మరింత ఎక్కువయి నయి. అప్పట్నుంచీ పెద్దక్కయ్య పాపా యితో వాళ్లింట్లోనే వుంది.

నాన్న కాంతం అక్కయ్యకి పాపం ఎన్నాళ్ళకీ పెళ్లి చెయ్యలేకపోయేడు. పెళ్లికొడుక్కి వందలూ, వేలూ యివ్వాలట. ఎందుకో తనకి తెలిసేది కాదు. తినటానికే లేకపోతే కట్నా లెక్కడ యివ్వగలనని నాన్న మొత్తుకునే వాడు. కాంతం అక్కయ్య ఓనాడు తనను పిలిచింది.

"శశీ వీధిలోకి వెళ్ళి నాన్నతో మాట్లాడుతున్నాయన్ని చూసిరా అమ్మా" అంది. తను చూసి వచ్చింది.

"ఎవరా తాత?"

"తాతకాదు శశీ నారాత! మీ చిన్న బావ! ఛీ! ఈ అమ్మా నాన్నకూ బుద్ధి ఉందా? ఓసారి బుద్ధివచ్చినా యింకా యిది లేదా? ఈ తాతని పెళ్ళి చేసుకుని ఏ సుఖం అనుభవించను శశీ!" కాంతం అక్కయ్య తన దగ్గిర ఏడ్చింది. తనకేం సరిగ్గా బోధపడినా బోధపడక పోయినా కాంతం అక్కయ్య అన్నిమాటలూ తనతోనే చెప్పేది. పెద్దక్కయ్యతో చెప్పదు. ఎందుచేతనంటే అది ఎప్పుడూ అమ్మపక్షమే! అది పెళ్ళి చేసుకొనే ముందు యిలా అల్లరి పెట్టలేదట!

నాన్న కాంతం అక్కయ్య దగ్గిరకొచ్చాడు.

"తల్లీ! నువ్విలా ఒద్దనడం ఏమయినా బాగుందా? ఒకటి, నీకు పెళ్ళి చెయ్యవలసిన బాధ్యత మాకు తీరిపోతుంది. రెండు. అతను మనకు రెండు వందలు ముందుగా యిచ్చి, చిన్న భూమి రాసిస్తానన్నాడు. దీనివల్ల మా కష్టాలు అంత కాకపోతే కొంతయినా తీరుతాయి. ఈ ముసిలి తండ్రిమీద ఆమాత్రం కనికరం లేదా!" నాన్న ఏడ్చాడు. నాన్నను పట్టుకుని అక్కయ్య ఏడ్చింది. "అలాగే నాన్నా!" అంది కన్నీరు కారుస్తూ. తనకెంత ఆశ్చర్యం వేసింది! ఆ పెళ్ళి వద్దు అని పంతంకట్టిన కాంతం అక్కయ్య యెంతక్షణాలో ఒప్పుకుంది? పిల్లలు ఆటలు, బాజాలు, పిండివంటలూ అని తను సరదాపడితే యెందుకో వెర్రికాంతం అక్కయ్య ఏడుస్తూ పెళ్ళి చేసుకుంది.

ఎందరెన్నివిధాల చెప్పినా కాంతం అక్కయ్య కాపురానికి మాత్రం వెళ్ళలేదు. అమ్మ, పెద్దక్కయ్య తిట్టిన తిట్లకి అంతులేదు. నాన్న చిన్నక్కయ్యను పట్టుకు బాదకొట్టాడు. బలవంతాన్న తీసుకెళ్ళి అప్పజెపతామన్నారు. ఎందుచేతనో గాని యెవరెంత బోధపరిచినా కాంతం అక్కయ్య అత్తారింటికి వెళ్ళలేదు. ఆనాడు కాంతం అక్కయ్య బోరున ఏడుస్తూ నాన్నతో ఏమని చెప్పింది?

"నాన్నా, మన దుర్భర దారిద్ర్యాన్ని పోగొట్టడానికి నా జీవితమంతా ధారపోస్తాను! కాని అక్కడికి వెళ్ళలేను; ఆయనతో కాపురం చెయ్యలేను. నన్ను క్షమించండి నాన్నా!" అమ్మా, పెద్దక్కయ్యే గాకుండా యెందరెందరో వచ్చి అక్కయ్యను నానా మాటలూ ఆడేవారు. అక్కయ్య జవాబు చెప్పకుండా అన్నిమాటలూ వింటూ శిలా విగ్రహంలా భరిస్తూ యెప్పుడూ ఏదో ఆలోచిస్తూ ఉండేది.

తరువాత పది పదిహేను రోజులకి కాబోలు కాంతం అక్కయ్య యెవరో కామేశ్వరరావనే అతన్ని తీసుకుపోయిందని యెక్కడ చూసినా చెప్పుకొనేవారు. అక్కయ్య కామేశ్వరరావుని పెళ్ళి చేసుకుందట అతనితో ఖరగ్‌పూర్‌లో కాపురం చేస్తోందిట. అతనికి ఖరగ్‌పూర్‌లో పెద్ద పనిట. ఈ విషయాలన్నీ అందరూ చెప్పుకున్నారు. అమ్మ, పెద్దక్కయ్య కాంతం అక్కయ్యను తిట్టినతిట్లు యిన్నీ అన్నీ కావు. ఖరగ్‌పూర్ వెళ్ళిపోయిన వారం రోజులకి కాంతం అక్కయ్య నాన్నకి నూరురూపాయలు పంపించింది. మళ్ళీ పదిహేను రోజులకి కాబోలు ఏభై రూపాయలు పంపించింది. రెండుమూడు ఉత్తరాలు రాసింది అసలు యిక్కడ ఉన్నప్పుడే కాంతం అక్కయ్యకు వీరంపగూ అంటే విపరీతమయిన అభిమానం. దూరదేశం వెళ్ళిపోయాక మరీ ఎక్కువయిపోయినట్టుంది. పేరుపేరున, తనకూ తమ్ముడికీ ఉత్తరాలు రాసింది. ఆడుకునే బొమ్మలుపంపించింది. ఎంత తియ్యగా ఎంత అభిమానంగా ఉత్తరాలు రాసింది? అమ్మా

వాళ్లూ అంటారుగాని కాంతం అక్కయ్య ఎంత మంచిది! తనూ, తమ్ముడూ ఉత్తరాలు రాస్తానంటే వద్దని అమ్మా, పెద్దక్కయ్యా అడ్డుపడి పోయారు! వాళ్ళూ రాయలేదు. డబ్బు మాత్రం తీసుకున్నారు. వాళ్ళడబ్బు మాత్రం పనికొచ్చి, వాళ్ళు మనుష్యులు మాత్రం ఎందుకు పనికిరాలేదో, తనకి బోధ పడితేనా?

పది నిమిషాలయింది. పెద్ద అక్కయ్యగాని అమ్మగాని లోపలినుంచి రాలేదు. తనుమాత్రం కామేశ్వర్రావు వైపు ఆశ్చర్యంగా చూస్తోంది. ఆ అరవై ఏళ్ళతాతను వదలి యింత చక్కని వాడిని పెళ్ళికుంటే తప్పెలా అయింది? వీళ్ళిద్దర్లో ఏరుకోమంటే తను ఎవరిని ఏరుకొనేది? ఇందులో కాంతం అక్కయ్య తప్పేమిటి? తనకి బోధపడలేదు.

చిన్న చినుకులు పడుతున్నాయి. బళ్ళోకెళ్ళిన తమ్ముడు పుస్తకం తడిసిపోకుండా బోడి పలక తలమీద బోర్లించుకుని లోనికి వచ్చాడు. రాగానే కాంతం అక్కయ్యని చూశాడు. వాడిమొహం ఆనందంతో చింకి చేటంతయింది. వచ్చినవాడు ఊరుకున్నాడా? తిన్నగా గది లోకి వెళ్లేడు. అక్కడున్న నులకమంచంమీద పలకా, పుస్తకాలూ విసిరి పారేశాడు. నిద్ర పోతున్న పెద్దక్కయ్య కొడుకుని లేపి కూర్చో పెట్టేడు.

"ఒరే, కాంతం అక్కయ్య వచ్చింది రారా!" అని వాడిని మెల్లిగా నడిపించుకుని అక్కయ్య దగ్గిరికి తీసుకువచ్చాడు. పరుగెత్తుకుని పాపాయిగాడు వచ్చి అక్కయ్య ఒడి అంతా స్వాధీన పరుచుకున్నాడు. తమ్ముడు వచ్చి పాపాయిగాడ్ని ఒక్క తోపుతోసి, అవతలకు లాగేసి తనాస్థలం ఆక్రమించుకున్నాడు. పాపాయికింద దొర్లుతున్నాడు. కామేశ్వర్రావు వాడిని లేవనెత్తి, ఎత్తుకుని రెండు బిస్కట్లు పెట్టి ఊరుకోబెట్టేడు.

కాంతం అక్కయ్య కెందుకో చెప్పలేనంత దుఃఖం వచ్చింది. ఆతను చూడకుండా తమ్ముడిని వాటేసుకుని అతికష్టంమీద కన్నీళ్లు ఆపుకుంది. కాంతం అక్కయ్య కన్నీళ్ళతోనే పుట్టిందేమో! చెప్పకేం, అక్కయ్యను చూస్తే తనకీ


# ఆంధ్ర బ్యాంక్ లిమిటెడ్

(స్థాపితము : 1923)

హెడ్డాఫీసు : మచిలీపట్టణము

చెల్లింపబడిన మూలధనము, రిజర్వులు కలిసి మొత్తం } రూ. 37,45,000

అమలులోనున్న వ్యాపారము మొత్తం రూ. 6,00,00,000 లకు మించినది.

చైర్మన్ :
శ్రీ ఎస్. ఆర్. వై. శివరామ ప్రసాద్ బహదూర్ గారు,
చల్లపల్లి రాజాసాహెబ్.

డెప్యూటీ చైర్మన్ :
శ్రీ కె. సుబ్బారావు నాయుడుగారు
మచిలీపట్నం.

మద్రాసు బ్రాంచి : 322-23, లింగిశెట్టి వీధి.

త్యాగరాయనగర్ ఆఫీసు :
87 పాండీ బజారు, త్యాగరాయనగర్,

మైలాపూరు ఆఫీసు : 77, కచేరీ రోడ్డు.

కోస్తా ఆంధ్ర జిల్లాలన్నిటిలోనూ బ్రాంచీలు, సబ్ ఆఫీసులూ ఉన్నాయి.

అన్ని రకముల డిపాజిట్లు ఆకర్షణీయమైన వడ్డీరేట్లకు తీసుకొనబడతాయి.

వివరములు బ్యాంకు యొక్క ఏ ఆఫీసులోనైనను తెలిసికొనవచ్చును.

మేనేజింగ్ డైరెక్టరు :
తాండేపల్లి శ్రీరాములు

జనరల్ మేనేజరు :
ఇ. రామచంద్రమూర్తి
ఎం. ఏ., సి. ఏ. ఐ. ఐ. బి.

దుఃఖమొచ్చింది. అక్కయ్య యింత మంచిదయితే అందరూ ఎందుకంతలా బాధించాలి? దగ్గరకొచ్చి ఒక్క మంచి మాటయినా ఆడకుండా ఎందుకలా దూరదూరంగా తిరగాలి?

కిరీన తలుపు చప్పుడై అందరూ అటు తిరిగారు. తనూ తిరిగింది. నాన్న వచ్చాడు. అందర్నీ ఆశ్చర్యంగా చూశాడు. కొంతం అక్కయ్యా, కామేశ్వర్రావు బావా లేచి నుంచున్నారు. నాన్న మొహం అదోలా పెట్టి ఏమీ మాటాడకుండా పెరట్లోకి వెళ్ళిపోయాడు! కొంతం అక్కయ్య వెర్రిగా చూస్తూ కూలబడి పోయింది! కామేశ్వర్రావు మొహం ఎర్రబడిపోయింది. కోపంతో అన్నాడు.

"వద్దు వద్దంటూంటే తీసుకు వచ్చావు. ముచ్చట తీరిందా? ఇహా పద" పెద్దక్కయ్య తన్నెందుకో పిలిచింది. తనూ తమ్ముడూ లోపలికి వెళ్లేక పెద్దక్కయ్య తనకీ తమ్ముడికీ కాఫీ ఇచ్చింది. అమ్మ నాన్నతో అంటోంది:

"మీ కింత మొహమాటమయితే ఎలా అండీ? దానికి బుద్ధిలేక వాడిని తీసుకొచ్చి యింట్లో పెడితే మన బుద్ధేమయింది? నలుగురూ వచ్చి చూస్తే ఏమౌతుంది? మొగుడుండగా మరొకడిని పెళ్ళాడినది నా కూతురే కాదని ఏనాడో అనుకున్నాను. వెళ్లి, పొమ్మని చెప్పండి. వెళ్ళకేం?"

అతి దీనమయిన మొహంతో కొంతం అక్కయ్య అక్కడికొచ్చింది.

"అంత మాటయినా ఆనకూడని తప్పు నేనేం చేశానమ్మా? ఒకసారి నిన్నూ, నాన్ననీ అక్కయ్యనీ పిల్లల్నీ చూద్దామని వచ్చాను. చూశాను. అంతే చాలు. మీకు నామీద అభిమానం పోయినా, నాకు మీమీద అభిమానం ఎప్పుడు ఒకలాగే ఉంటుంది. ఆయనకి ఆరు వందలు జీతం. నామీద కొంచమయినా అభిమానం మిగిలి ఉంటే నెలకి ఒక వందరూపాయలు తీసుకోండి. నాన్నా, అమ్మా, అక్కయ్యా... వెడతాను. నమస్కారం"

కొంతం అక్కయ్య అక్కడినుంచి వెళ్ళి పోయింది. తమ్ముడు తన చెవులో మెల్లిగా "అక్కా, కాఫీ అక్కయ్య కిద్దామా?" అన్నాడు. వెధవ, ఎంత అభిమానం వాడికి?

"అలాగే కాని...ఎంగిలి చేశాం మరి?"

"ఫరవాలేదు...మన అక్కయ్యేగా"

పెద్దక్కయ్యా అమ్మా చూడకుండా తనూ తమ్ముడూ కాఫీ గ్లాసులు తెచ్చి అక్కయ్యకీ, కామేశ్వర్రావు బావకీ యిచ్చారు. ఎందుకనో గాని వెర్రి కామేశ్వరం బావ కాఫీ తాగే ముందు కళ్ళ కద్దుకున్నాడు!

సామానంతా బండిలో ఎక్కింది. తమ్ముడు తనతో అన్నాడు.

"మాటయినా ఆడేరు కారు! ఛీ! యీ అమ్మా నాన్నా జట్టు నే ఉండను!"

"నేనూను!" అన్నాడు పాపాయి. తను నవ్వుకుంది.

కొంతం అక్కయ్య బండెక్కుతూ అంది,

"ఏమండీ, మా యింట్లో వాళ్ళని చూశారు కదా, యిందులో పెద్దలెవరు? చిన్నలెవరు?"

"చిన్నలే పెద్దలు. కాని పెద్దయిన కొద్దీ పెద్దల చిన్నతనం అంటుకుని చిన్నలైపోతారు! మూర్ఖులు! వీళ్ళను బాగుచేద్దామనుకోడం కూడా పొరపాటే! పిల్లిలా క్షమించి సహించవలసిందే!" అన్నాడు కామేశ్వరం బావ.

కొంతం అక్కయ్య వెళ్లి పోయేదాకా చూస్తూ నిలబడ్డారు తను, తమ్ముడు, పాపాయి

సోవియట్ దేశంలో పత్రికా స్వాతంత్ర్యం!

సోవియట్ చట్టరీత్యా వార్తాపత్రికలను వ్యక్తులు ప్రయివేటుగా ప్రచురించడానికి వీలులేదు. వార్తాపత్రికలు, మేగజైన్లు ప్రభుత్వ సంస్థల చేతనూ శ్రామిక ప్రజాసంస్థల చేతనూ ప్రచురించబడతాయి.

—టాస్ వార్తాసంస్థ పత్రిక